మొక్కలను రక్షించాలి


మొక్కలు నాటే పనిని పరిశీలించిన కమిషనర్‌ ప్రదీప్‌కుమార్‌

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని ల్యాంకోహిల్స్‌ జీసర్కిల్‌ నుంచి ఔటర్‌రింగ్‌ రోడ్డుకు వేసిన కొత్త రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటుతున్న పనులను గురువారం మున్సిపల్‌ కమిషనర్‌ డి. ప్రదీప్‌కుమార్‌ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ప్రతి రోడ్డు పక్కన వీలైనన్ని ఎక్కువగా మొక్కలను నాటేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. పార్కులు, ఖాళీ స్థలాల్లోను మున్సిపాలిటీ తరఫున నాటుతామని, వనమహోత్సవంలో భాగంగా నాటే మొక్కలను తప్పనిసరి సంరక్షించాలన్నారు. అనంతరం ఔటర్‌ రింగ్‌ రోడ్డు 11వ వార్డులో డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో ఏఈ సంజయ్‌, ఎన్విరాన్‌మెంట్‌ సూపర్‌వైజర్‌ సంపత్‌, సిబ్బంది పాల్గొన్నారు.

‘సీఎం క్షమాపణలు చెప్పాలి’


బీఆర్‌ఎస్‌ నాయకుల నిరసనను అడ్డుకుంటున్న పోలీసులు

మణికొండ: అసెంబ్లీలో సీనియర్‌ మహిళా శాసనసభ్యులైన సబితా రెడ్డి, సునితారెడ్డిలను అకారణంగా విమర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి వారికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని బీఆర్‌ఎస్‌ పార్టీ మణికొండ మున్సిపాలిటీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కె. ధన్‌రాజ్‌, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డిలు డిమాండ్‌ చేశారు. ఈ సందర్భంగా గురువారం మున్సిపాలిటీ కేంద్రం మర్రిచెట్టు సర్కిల్‌లో బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులు సీఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నించటంతో రాయదుర్గం పోలీసులు అడ్డుకుని వారిని అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌ నవీన్‌ కుమార్‌, నాయకులు ఎ.లక్ష్మణ్‌రావు, కీర్తి లతాగౌడ్‌, సురేఖ, ఉపేంద్రనాథ్‌రెడ్డి, శ్రీకాంత్‌, లక్ష్మయ్య, సుమ, రాజేంద్రప్రసాద్‌, ఆరీఫ్‌, ఉదయ్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌ సమస్యలను పరిష్కరిస్తాం


స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న విద్యుత్‌ అధికారులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని హైదర్షాకోట్‌లోని రాజీవ్‌ గృహకల్ప భవన సముదాయంతో అసిస్టెంట్‌ డివిజనల్‌ ఇంజనీర్‌ సత్యనారాయణ, అసిస్టెంట్‌ ఇంజనీర్‌ హాథిరామ్‌లతో కలిసి గురువారం పర్యటించారు. ఈ నేపథ్యంలో విద్యుత్‌ వినియోగదారులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యుత్‌ వినియోగదారులు తమ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా రత్నాకర్‌రావు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో విద్యుత్‌ సమస్యలను పరిష్కరించడానికి పర్యటిస్తున్నామని, సకాలంలో వినియోగదారులు బిల్లులు చెల్లించి సంస్థ అభ్యున్నతికి తోడ్పాటును అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెదడు వాపు టీకాలు తీసుకోవాలి


విద్యార్థులకు టీకాలను ఇచ్చిన వైద్య సిబ్బంది

మణికొండ: మెదడు వ్యాపు వ్యాధిని నివారించే క్రమంలో 9 నెలల వయస్సు నుంచి 15 సంవత్సరాల వయస్సు వరకు ఉన్న పిల్లలకు టీకాలను వేస్తున్నామని, తల్లితండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలకు టీకాలను ఇప్పించాలని గండిపేట మండల వైద్యాధికారి సత్యరత్న అన్నారు. గురువారం నార్సింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీకాల కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 9వ తేదీ వరకు మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ టీకాలను ఇస్తామన్నారు. టీకా తీసుకోవటంతో పందుల నుంచి వచ్చే మెదడు వ్యాపు వ్యాధి రాకుండా ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, బస్తీదవఖాణల్లోను వీటిని ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్య విస్తరణాధికారి సల్మాన్‌రాజు, ఏఎన్‌ఎంలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ విగ్రహం వద్ద సంబరాలు

రాజేంద్రనగర్‌: న్యాయబద్ధమైన ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిన శుభ సందర్భంగా గురువారం రాజేంద్రనగర్‌ అంబేడ్కర్‌ విగ్రహం వద్ద బీజేపీ చేవెళ్ల పార్లమెంటు ఎస్సీ మోర్చా కన్వీనర్‌ జోగి రవి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఆత్మగౌరవం కోసం, విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో వివక్షను ఎదిరిస్తూ సమాన వాటా కోసం పోరాడిన ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలన్నారు. వర్గీకరణ డిమాండ్‌కు మద్దతుగా నిలిచిన ప్రజాస్వామ్యవాదులందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్‌, కార్యదర్శి కొమురయ్య, కార్పొరేటర్‌ సంగీత, ఎస్సీ మోర్చా రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్‌, విజయ్‌ కుమార్‌, బాబురావు, ఆదిముల చంద్రశేఖర్‌, రామారావు, రాంబాబు, మధుసూదన్‌ రెడ్డి, బీజేపీ రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సంబరాల్లో పాల్గొన్న నాయకులు

రాములోరి భూమి స్వాధీనమెప్పుడో?

- ఏడీ సర్వేలో తేలిన కబ్జాలు
- నివేదిక కోసం ఎదురుచూపులు


రామచంద్రజీ దేవాలయం



మార్కు వేసిన ఏడీ సర్వే అధికారులు

శంషాబాద్‌: రామచంద్రజీ దేవాలయం భూములు పరాధీనమయ్యాయని ఏడీ సర్వే స్పష్టం చేసింది. మున్సిపాలిటీలోని శంషాబాద్‌ రెవెన్యూ పరిధిలో ఉన్న శ్రీరామచంద్రజీ దేవాలయానికి శంషాబాద్‌ రెవెన్యూతో పాటు జీహెచ్‌ఎంసీ పరిధిలోని గగన్‌పహాడ్‌ రెవెన్యూ వివిధ సర్వే నంబర్లలో కలుపుకుని మొత్తం 70 ఎకరాల్లో ఉంది. ఇందులో సింహభాగం భూములు కోర్టు పరిధిలోనే ఉన్నాయి. జాతీయ రహదారికి పక్కనే శంషాబాద్‌ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్‌ 668లో దేవాలయంతో పాటు ఖాళీ స్థలం మొత్తం 7.18 ఎకరాల భూమి ఉంది. ఇందులో ఆలయం వెనకాల ఉన్న భూమిని ఎండోమెంట్‌ అధికారులు ఓ వాణిజ్య కేంద్రానికి లీజుకు అప్పగించారు. ఆలయానికి సమీపంలో త్రిలోక్‌ కన్‌స్ట్రక్షన్‌ కంపెనీ కొనసాగిస్తున్న భవంతుల చోట ఆలయానికి సంబంధించిన 1200 గజాల భూమి ఉన్నట్లు ఆరు నెలల కిందట జరిగిన ఏడీ సర్వేలో స్పష్టమైంది. ఆలయానికి ఎదురుగా ఉన్న హిందుస్థాన్‌ పెట్రోలు బంకు పరిధిలో మరో నాలుగు గుంటల స్థలం కబ్జా ఉన్నట్లు ఏడీ సర్వేలో తేలింది.

నివేదిక కోసం..

సర్వే పూర్తయినప్పటికి దానికి సంబంధించిన ఉత్తర్వులు ఎండోమెంట్‌ అధికారులకు అధికారికంగా ఇంకా అందలేదు. పెట్రోలు బంక్‌లో ఉన్న ఆలయ భూమిపై సదరు యజమాని తాను గతంలోనే ట్రిబ్యునల్‌ ఆదేశాల మేరకు 90 గజాల స్థలం అప్పగించినట్లు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. అయితే ఏడీ సర్వేలో స్పష్టంగా తేలిన మరో నాలుగు గుంటల భూమిని స్వాధీనం చేసుకునేందుకు ఎండోమెంట్‌ అధికారులు కూడా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనికి న్యాయస్థానం ఇచ్చే మార్గదర్శకాలపైనే స్వాధీనం చేసుకునేందుకు అడుగులు ముందుకు పడతాయని ఎండోమెంట్‌ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం 668 సర్వే నంబరులో కబ్జాలో ఉన్న భూమితో పాటు, గత రెండు దశాబ్దాల కాలంగా అన్యాక్రాంతంలో ఉండి కోర్టు కేసుల్లో ఉన్న భూమిని కూడా చట్టపరంగా స్వాధీనం చేసుకుని ఆలయ పరిధిలోకి తీసుకురావాలని శంషాబాద్‌, సాతంరాయి బస్తీల ప్రజలు డిమాండ్‌ చేస్తున్నారు.

> **నివేదిక రాగానే చర్యలు చేపడుతాం**
>
> ఏడీ సర్వే నివేదిక రాగానే చర్యలు చేపడుతాం. సర్వే నంబరు 668లో ఇప్పటి వరకు కబ్జాలో ఉన్న భూమిపై ఏడీ సర్వేలో స్పష్టమైంది. కార్పొరేట్‌ కంపెనీ కబ్జాలో ఉన్న భూమిని కూడా స్వాధీనం చేసుకుంటాం. పెట్రోలు బంకులో ఉన్న కబ్జాపై సదరు యజమానితో పాటు తాము కూడా న్యాయస్థానాన్ని ఆశ్రయించాం. న్యాయస్థానం ఇచ్చే మార్గదర్శకాలపై త్వరలోనే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. –మోహన్‌రావు, ఎండోమెంట్‌ ఈవో

తడి-పొడి చెత్తను వేరు చేసి అందించాలి


చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్‌

బండ్లగూడ: 17వ డివిజన్‌లోని ప్రశాంత్‌నగర్‌ కాలనీ, 8వ డివిజన్‌లోని మెయిన్‌ రోడ్డు, 18వ డివిజన్‌లోని మాచన్‌పల్లి ఎన్‌క్లేవ్‌ కాలనీలలో చెత్త సేకరణను గురువారం మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ బి.శరత్‌చంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త సేకరణ కార్మికులకు అందించాలని కోరారు. సేకరించిన తడి చెత్తను ఎరువుగా మార్చాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రజలు చెత్తా- చెదారాలను రోడ్లకు ఇరువైపుల, ఖాళీ ప్రదేశాల్లో వేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ ఎస్‌ఐ నరేష్‌, శానిటరీ జవాన్లు సురేష్‌, యాదగిరి, రాము, డ్రైవర్లు పాల్గొన్నారు.

హరియాణా గవర్నర్‌కు సన్మానం


దత్తాత్రేయను సత్కరిస్తున్న అడిగే రాజు

రాజేంద్రనగర్‌: హరియాణా గవర్నర్‌ బండారు దత్తాత్రేయను గురువారం హర్యానా భవనంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రొగ్రాం కో-ఆర్డినేటర్‌ అడిగే రాజు, రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆనంద్‌ గౌడ్‌ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం బండారు దత్తాత్రేయ అడిగే రాజును మెమెంటో, శాలువాతో సన్మానించారు.

పాలాభిషేకం

మణికొండ: దశబ్దాల పాటు పోరాటం చేసి మాదిగ ఉపకులాల రిజర్వేషన్‌ బిల్లు అమలుకు గురువారం సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వటంతో మాదిగ సమాజం హర్షం వ్యక్తం చేసింది. అందులో భాగంగా నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ విగ్రహం వద్ద ఆయనకు నివాళులు అర్పించి ఎమ్మార్పీఎస్‌ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా నాయకుడు పి. గణేష్‌ మాదిగ, జగన్‌ మాదిగలు మాట్లాడుతూ.. దశబ్దాల పాటు పోరాటం చేసి మాదిగలకు న్యాయం చేసిన ఘనత మంద కృష్ణమాదిగకు దక్కుతుందన్నారు. వర్గీకరణను వెంటనే అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించటం ఎంతో ఆనందం కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వేణుకుమార్‌, నాయకులు పాల్గొన్నారు.


మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ఎమ్మార్పీఎస్‌ నాయకులు

నిరంతరం విద్యుత్‌ అందిస్తాం


విద్యుత్‌ సమస్యలను తెలుసుకుంటున్న అధికారులు

రాజేంద్రనగర్‌: క్షేత్రస్థాయిలో విద్యుత్‌ సమస్యలను పరిష్కరించడానికి పర్యటిస్తున్నామని రాజేంద్రనగర్‌ విద్యుత్‌ డివిజనల్‌ ఇంజనీర్‌ పి.రత్నాకర్‌ రావు తెలిపారు. గురువారం రాజేంద్రనగర్‌ సర్కిల్‌ పరిధిలోని బుద్వేల్‌ శివసాయినగర్‌ కాలనీలో అసిస్టెంట్‌ డివిజనల్‌ ఇంజనీర్‌ సత్యనారాయణ, అసిస్టెంట్‌ ఇంజనీర్‌ హాథిరాంలతో కలిసి పర్యటించి, విద్యుత్‌ వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రజలకు నిరంతర విద్యుత్‌ను అందజేస్తుందని, సకాలంలో వినియోగదారులు బిల్లులు చెల్లించి సంస్థ అభ్యున్నతికి తోడ్పాటును అందించాలన్నారు.

రూ.50 లక్షలు ఎత్తుకెళ్లిన దొంగల అరెస్ట్‌

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్‌ పారిశ్రామికవాడలోని భారతి ట్రేడర్స్‌ బ్యాటరీ కంపెనీలో గత నెల 21 అర్ధరాత్రి కొందరు దొంగలు రూ.50 లక్షల నగదును దొంగిలించి పరారయ్యారు. శంషాబాద్‌ సీసీఎస్‌, రాజేంద్రనగర్‌, మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు ఆ దొంగలను పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. గురువారం రాజేంద్రనగర్‌ డీసీపీ కార్యాలయంలో చింతమనేని శ్రీనివాస్‌ వివరాలను వెల్లడించారు. మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతాలకు చెందిన షేక్‌ మహమ్మద్‌ అఖీల్‌ (25), షేక్‌ అదన్‌ (21), మహమ్మద్‌ సైఫ్‌ (25), సైయ్యద్‌ మోసీన్‌ (28) కొంత కాలంగా కాటేదాన్‌ పారిశ్రామికవాడల్లోని పరిశ్రమలల్లో ఎక్కడ ఎక్కువ డబ్బులు తీసుకొస్తారనే సమాచారాన్ని సేకరించి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ కంపెనీలో దొంగతనం చేయడానికి 11 మంది కలిసి ప్రణాళిక రూపొందించారు. అందులో భాగంగా ఒక ఇన్నోవా కారును అద్దెకు తీసుకొని, బ్లాక్‌ ఫేస్‌ మాస్కులు ధరించి నలుగురు ఆదివారం బ్యాటరీ కంపెనీలోకి చొరబడ్డారు. కంపెనీలో పడుకున్న వారికి కత్తి చూపించి బీరువాలో నుంచి రూ.50 లక్షలను ఎత్తుకెళ్లారు. ఈ నేపథ్యంలో పట్టుబడ్డ నలుగురి దొంగల నుంచి రూ.16 లక్షలు, ఓ ఇన్నోవా, ఒక బైక్‌, రెండు మొబైల్‌ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారీలో ఉన్న 7 మంది దొంగలను త్వరలోనే పట్టుకుంటామన్నారు. నిందితులు గతంలో అత్తాపూర్‌లో ఓ దొంగతం కేసులో పట్టుబడ్డటు గుర్తించామన్నారు. రాజేంద్రనగర్‌ ఏసీపీ శ్రీనివాస్‌, మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్‌ నరేందర్‌ పాల్గొన్నారు.

నూతన ఎంఈవోగా శంకర్‌ రాథోడ్‌



అత్తాపూర్‌: రాజేంద్రనగర్‌ మండల నూతన ఎంఈవోగా శంకర్‌ రాథోడ్‌ బాధ్యత చేపట్టారు. గతంలో ఫరూక్‌నగర్‌, షాబాద్‌ ఎంఈవోగా పనిచేసిన శంకర్‌ రథోడ్‌ బదిలీ పైన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి కృషిచేస్తానని తెలిపారు. మండలంలోని పాఠశాలలను నిరంతరం పర్యవేక్షణ చేస్తానని అన్నారు.

48వ వ్యవస్థాపక దినోత్సవం


సమావేశంలో పాల్గొన్న అధికారులు, రైతులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ 48వ వ్యవస్థాపక దినోత్సవను గురువారం సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నూనె గింజల పంటలై జీవసంబంధిత ఒత్తిడులు, వాటియాజమాన్యంలో వినూత్న విధానాల పై డైరెక్టర్‌ డాక్టర్‌ పీకే ఘెష్‌ మాట్లాడారు. ఆహార నాణ్యత, ఆహార వృధా, రసాయన వినియోగం వల్ల కలిగే నష్టాలు వాటి గురించి వివరించారు. ఐసీఏఆర్‌ సంస్థ సాధించిన గణనీయమైన విజయాన్ని సహకార పరిశోధన అభివృద్ధి పై దృష్టి సారిస్తుందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో సీడ్‌ కోటింగ్‌, క్లస్టర్‌ ఒరియంటెట్‌ ప్రదర్శనలు, డ్రోన్‌ ఆధారిత టెక్నాలజీ డిజిటల్‌ ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. నూనె గింజల పరిశోధన పై శాస్త్రవేత్తలు వ్రాసిన ప్రచురణను విడుదల చేశారు. పారిశ్రామికవేత్తలు, రైతులు నూనెగింజల పంటలలో తమ విజయగాధలను, అనుభవాలను సదస్సులో పంచుకున్నారు. నూనెగింజల ఆధారిత ఉత్పత్తిలో కృషి చేసి ఉత్తమ ఫలితాలు సాధించిన రైతులను, పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలను, సిబ్బందికి, కార్మికులను అవార్డులను అందించారు. రైతులకు ఆముదం, కుసుమ, నువ్వులలో హైబ్రిడ్‌ విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం డయాబెటాలజీ స్పెషలిస్ట్‌ డాక్టర్‌ రాహుల్‌ గాంధీ జీవనశైలి మార్పులు దాని ప్రయోజనాలు అనే అంశంపై రైతులకు, సిబ్బందికి సలహాలు సూచనలు ఇచ్చారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

శంషాబాద్‌: పీఆర్‌టీయూ సభ్యత్వ వారోత్సవాల సందర్భంగా శంషాబాద్‌లో గురువారం సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్‌ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జీవో నెంబరు 11,12 సవరించి బీఈడీ అర్హత కలిగిన ఉపాధ్యాయులను ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా నియమించాలన్నారు. ఉపాధ్యాయుల పెండింగ్‌ బిల్లులను ప్రభుత్వం వెంటనే క్లియర్‌ చేయాలన్నారు. బకాయిలో ఉన్న డీఏను వెంటనే అందించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యులు, రైతుల చర్చా గోష్ఠి


సదస్సులో మాట్లాడుతున్న ఐఎస్‌ఏపీఎం వ్యవస్థాపక సభ్యుడు బిదార్కర్‌

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని పీవీ నరసింహా రావు పశువైద్య విశ్వవిద్యాలయంలో ఇండియాన్‌ సొసైటి ఆఫ్‌ యానిమల్‌ ప్రొడక్షన్‌ మేనేజ్మెంట్‌ (ఐఎస్‌ఏపీఎం) 41వ వ్యవస్థాపక దినోత్సవాని పురస్కరించుకుని గురువారం పశువైద్య కళాశాలలో పశువైద్యులు, శాస్త్రవేత్తలు, రైతుల మధ్య చర్చా గోష్టిని నిర్వహించారు. పశు ఉత్పత్తి పై వాతావరణ మార్పులు అనే అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా రైతులకు ఉన్న సమస్యలపై శాస్త్రవేత్తలు, అధికారులు, పరిష్కారాలు అందించారు. రైతుల సమస్యలకు అనుగుణంగా పరిశోధనలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఐఎస్‌ఏపీఎం వ్యవస్థాపక సభ్యుడు రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ డి.కె బిదార్కర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా పశు ఉత్పత్తిపై వాతావరణ మార్పుల ప్రభావం అనే అంశంపై విద్యార్థులకు పోస్టర్‌ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్‌ రఘునందన్‌ రావు, రంగారెడ్డి జిల్లా పశువైద్య అధికారి డాక్టర్‌ విజయ్‌కుమార్‌, ప్రొఫెసర్స్‌ మహేందర్‌, ఉదయ్‌కుమార్‌, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన కేంద్రాలను పటిష్టంగా నిర్వహించాలి

వెస్ట్‌జోన్‌ జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌రెడ్డి



రాయదుర్గం: ప్రజాపాలన కేంద్రాలను అత్యంత పటిష్టంగా నిర్వహించాలని జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్‌ జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌రెడ్డి సూచించారు. గురువారం వెస్ట్‌జోన్‌ పరిధిలోని డిప్యూటీ కమిషనర్లు, ఇతర అధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్‌ను గచ్చిబౌలిలోని వెస్ట్‌జోన్‌ కార్యాలయం నుంచి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై వినతులను స్వీకరించడంతోపాటు పరిష్కారానికి చర్యలు కూడా చేపట్టాలని ఆదేశించారు. వార్డుకో ప్రజాపాలనా కేంద్రం అందుబాటులో ఉన్నాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేయాలని సూచించారు. జోన్‌ వ్యాప్తంగా సినిమాహాల్స్‌, మాల్స్‌లలో పార్కింగ్‌, తినుబండారాలపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలన్నారు. పారిశుద్ధ్యం నిర్వహణను పకడ్బందీగా చేయాలన్నారు. ప్రతి ఇంటికి స్వచ్ఛ ఆటో వెళ్లేలా, ప్రతి వాణిజ్య దుకాణం ఎదుట డస్ట్‌బిన్లను ఏర్పాటు చేసుకునేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఫాగింగ్‌ను నిర్లక్ష్యం చేయవద్దని ముందుస్తుగా కాలనీలకు సమాచారం అందించాలన్నారు. ప్రతి శుక్రవారం వాలంటీర్లతో కాలనీలలో అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టినందున రహదారులపై ఏర్పడ్డ గుంతలను తక్షణమే పూడ్చివేయాలని, దెబ్బతిన్న మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేయాలని సూచించారు. ఈనెల 15వ తేదీలోగా పూర్తి స్థాయిలో జీవీపీలను ఎత్తి వేయాలని చెప్పారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో డిప్యూటీ కమిషనర్లు, ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్లు, అసిస్టెంట్‌ ఇంజనీర్లు, మెడికల్‌ ఆఫీసర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, ఎంటమాలజీ విభాగం, ఫుడ్‌ సేఫ్టీ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఆలయం పునరుద్ధరణకు చర్యలు


సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు, పూజారి తదితరులు

రాజేంద్రనగర్‌: అంబేద్కర్‌నగర్‌ కాలనీ రాజేంద్రనగర్‌ సబ్‌ రిజిస్ట్రారు కార్యాలయం ముందు ఉన్న పురాతన హనుమాన్‌ దేవాలయాన్ని పునరుద్ధరణ కార్యక్రమం కోసం గురువారం ఆలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూజారి రెవల్లి రవిశర్మ మార్గదర్శనం చేశారు. ఆదివారం ఉదయం 8 గంటలకు బస్తీలోని భక్తులందరూ పెద్ద ఎత్తున పాల్గొని దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్‌, అంబేద్కర్‌ సంఘం సలహాదారులు పచ్చ శ్రీనివాస్‌, కిరోసిన్‌ రాజు, భీమయ్య, జంగయ్య, జ్ఞానేశ్వర్‌, వెంకటేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు


పూజల్లో పాల్గొన్న మాజీ సర్పంచ్‌, మాజీ ఎంపీటీసీలు

మణికొండ: ఆషాఢమాసంలో గ్రామ దేవతలకు నిర్వహించే బోనాల ఉత్సవాలను నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లి గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే దేవాలయానికి చేరుకున్న భక్తులు ప్రత్యేక పూజలు, నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల శిగాల మధ్య బోనాలతో మహిళలు ఆలయానికి చేరుకున్నారు. బోనాల పాటలు, ప్రత్యేక అలంకరణలతో ఆలయ ప్రాంగణం శోభాయమానంగా మారింది. బోనాల ఉత్సవాలు, ప్రత్యేక పూజల్లో కౌన్సిలర్‌ బి.యాదమ్మ, మాజీ సర్పంచ్‌ స్వరూప, మాజీ ఎంపీటీసీ నగేష్‌ యాదవ్‌ పాల్గొన్నారు.


అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వస్తున్న భక్తులు

ఒడిబియ్యంతో మహా ప్రసాదం


మహా ప్రసాదంలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌లోని ఈదమ్మ, భూలక్ష్మమ్మ దేవాలయంలో గురువారం బోనాల పండుగ రోజు వచ్చిన ఒడి బియ్యంను మహా ప్రసాదంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆషాఢమాసం బోనాల పండుగను పురస్కరించుకొని భక్తులు ఈదమ్మ, భూలక్ష్మమ్మకు ఒడిబియ్యం సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని నిర్వాహకులు తెలిపారు.

200 విమానాశ్రయాల్లో సన్‌ఫ్లవర్‌ ట్యాగ్‌ సేవలు

- వైకల్యాలున్న ప్రయాణికులకు సన్‌ఫ్లవర్‌ ట్యాగ్‌
- శంషాబాద్‌ విమానాశ్రయంలో కొత్త ట్యాగ్‌ ప్రారంభం
- మెరుగైన సేవలు అందించే దిశగా అడుగులు
- వైకల్యాలతో ఉన్నవారి కోసమే సన్‌ఫ్లవర్‌ ట్యాగ్‌



విమానాశ్రయంలో సమాచార డెస్క్‌లో సన్‌ఫ్లవర్‌ ట్యాగ్‌ సేవలు

శంషాబాద్‌: శంషాబాద్‌ విమానాశ్రయంలో ప్రయాణికుల సౌలభ్యాన్ని పెంచే దిశగా జీఎంఆర్‌ హైదరాబాద్‌ ఎయిర్‌పోర్టు అధికారులు సన్‌ఫ్లవర్‌ ట్యాగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈఓ ప్రదీప్‌ ఫణీకర్‌ మాట్లాడుతూ.. వైకల్యాలతో ఉన్న ప్రయాణికులకు మెరుగైన సేవలందించడంలో ఈ ట్యాగ్‌ ఉపయోగపడుతుందని అన్నారు. తక్కువ దృష్టి ఆటిజం, మెధోవైకల్యం, చిత్తవైకల్యం, వినికిడి లోపం ఉన్న ప్రయాణికులకు విమానాశ్రయంలోని సిబ్బంది, అధికారులు వారి అవసరాలను గుర్తించి మరింత మెరుగైన ప్రయాణ సౌలభ్యాన్ని కలిగించేందుకు ట్యాగ్‌ దోహదపడుతుందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా 200 విమానాశ్రయాల్లో ఇప్పటికే సన్‌ఫ్లవర్‌ ట్యాగ్‌ సేవలున్నాయన్నారు. విమానాశ్రయానికి సంబంధించిన వెబ్‌సైట్‌లతో పాటు ఎయిర్‌పోర్టులో ఇందుకు సంబంధించిన సమాచార డెస్క్‌లో ఫారంపూర్తి చేసి ఇస్తే వారికి ట్యాగ్‌ లభిస్తుందని తెలిపారు.